సాక్షి
విశాఖపట్నం
గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



'ఫుడ్ క్రాఫ్ట్'లో కొత్త కోర్సులు

ఫుడ్ క్రాఫ్ట్ రంగంలో కొత్త కోర్సులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి చెప్పారు. 10లో



బాధ్యులపై కఠిన చర్యలు

అర్చకునిపాలెం ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ జ్యోతికుమారి. డీఈవో చంద్రకళ తెలిపారు. 8లో



విద్యుత్ సమస్యలకు పరిష్కారం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సీఎండీ సంతోషరావు ఆదేశించారు. 8లో

వెల్లువలా

పెట్టుబడులు రూ.1.17 లక్షల కోట్లు

ఉద్యోగాలు 81,450

గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా.. డేటా సెంటర్ హబ్‌గా ఉమ్మడి విశాఖ

- పూడిమడకలో రూ.1.10 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు
- 61 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్న ఎన్‌టీపీసీ
- కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- 20,450 మందికి ఉపాధి అవకాశాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో కీలక ప్రాజెక్టులకు అడుగులు పడుతున్నాయి. ఐటీ హబ్‌గా పర్యాటక డెస్టినీగా భాసిల్లుతున్న వైజాగ్.. ఇప్పుడు డేటా సెంటర్‌కు ప్రధాన కేంద్రంగానూ, గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్‌గా మారనుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల పెట్టుబడితో 61 వేల మందికి ఉపాధి కల్పించేలా ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా రూ.7,210 కోట్ల పెట్టుబడితో 20 వేలపై చిలుకు ఉద్యోగాలు కల్పించేలా డేటా సెంటర్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఉమ్మడి విశాఖ చరిత్రలో ఒకేసారి రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులు, 80 వేలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

కీలక ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖపట్నం మారుతోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం.. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో నగరంలో పెట్టుబడులకు, భారీ ప్రాజెక్టులకు ఉన్న అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రెండ్రోజుల క్రితం జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. ఇందులో సింహభాగం విశాఖకే చెందినవి కావడం గమనార్హం. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏకంగా రూ.1,17,210 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో విశాఖ జిల్లా పారిశ్రామిక రంగంలో సరికొత్త విభాగాలకు కేంద్ర బిందువుగా మారుతోంది.

గ్రీన్ ఎనర్జీ కేరాఫ్ పూడిమడక

దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు అచ్యుతాపురం మండలంలోని పూడిమడక చిరునామాగా మారనుంది. ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా లక్షా 10 వేల కోట్ల రూపాయల వ్యయంతో న్యూ ఎనర్జీ పార్కు నిర్మించనుంది. ఈ పార్కులో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్, హైడ్రోజన్ సంబంధిత ఉత్పత్తులు తయారవుతాయి. ఇంధన రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా కొత్త తరహాలో ఉత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ప్రణాళికలు తయారు చేసింది. రెండు దశల్లో పూర్తి చేసే ఈ ప్రాజెక్టు ద్వారా 61 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రానున్నాయి.



ప్రాజెక్టు పేరు : ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్కు
పెట్టుబడి : రూ.1,10,000 కోట్లు
విస్తీర్ణం : సుమారు 1000 ఎకరాలు
ఉపాధి అవకాశాలు : 61 వేల మందికి
మొదటి దశ : రూ.55 వేల కోట్లు, 30 వేల మందికి ఉపాధి అవకాశాలు
పూర్తి చేసే సమయం : 2027
రెండోదశ : రూ.55 వేల కోట్లు, 31 వేల మందికి ఉపాధి అవకాశాలు
పూర్తి చేసే సమయం : 2033

కాపులుప్పాడలో డేటా సెంటర్

మధురవాడ ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌కు ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన విషయం విదితమే. రూ.14,634 కోట్ల పెట్టుబడులతో 200 మెగావాట్ల సామర్థ్యంతో డేటాపార్క్ రాబోతోంది. తాజాగా 100 మెగావాట్ల సామర్థ్యంతో మరో డేటా సెంటర్ దాని సమీపంలోని కాపులుప్పాడ ప్రాంతంలో ఏర్పాటుకు ఎస్ఐపీబీ పచ్చజెండా ఊపింది. వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ సంస్థ ఈ డేటా సెంటర్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రూ.7,210 కోట్ల పెట్టుబడులతో 20,450 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలని సంకల్పించారు. మొత్తంగా ఈ రెండు ప్రాజెక్టులూ పూర్తయితే విశాఖ నగరం ఆంధ్రప్రదేశ్‌కు డేటా సెంటర్ హబ్‌గా మారనుంది.



ప్రాజెక్టు పేరు : డేటా సెంటర్
ఎవరి ఆధ్వర్యంలో : వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్
పెట్టుబడి : రూ.7,210 కోట్లు
ఉపాధి అవకాశాలు : 20,450 మందికి
ప్రత్యక్షంగా : 14,825 మందికి
పరోక్షంగా ఉపాధి : 5,625 మందికి
ప్రాజెక్టు పూర్తయ్యేది : 2026
మొదటి దశలో.. : 10 మెగావాట్లు
రెండో దశలో : 40 మెగావాట్లు
మూడో దశలో : 50 మెగావాట్లు

న్యూస్‌రీల్

మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్



వైద్య ఉపకరణాల తయారీని పరిశీలిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఓవెన్

సాక్షి, విశాఖపట్నం : ఏపీ, తెలంగాణ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గేరత్ విన్ ఓవెన్ విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌ని బుధవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా మెడ్‌టెక్ జోన్ సీఈవో డా.జితేంద్రకుమార్ శర్మ ఆయనకు స్వాగతం పలికారు. మెడ్‌టెక్ జోన్ పరిధిలో తయారు చేస్తున్న వైద్య ఉపకరణాల యూనిట్లను ఓవెన్ పరిశీలించారు. ఏఎంటీజెడ్ పనితీరు అద్భుతంగా ఉందని ఆయన కితాబిచ్చారు.

షబ్నంకు అభినందనలు



షబ్నంను అభినందిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

మహారాణిపేట: అండర్–19 మహిళా వరల్డ్ కప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలైన షబ్నంను టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అభినందించారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఆమె మర్యాదపూర్వకంగా సుబ్బారెడ్డిని కలిశారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, కోస్తాంధ్ర మైనార్టీ విభాగ అధ్యక్షుడు ఐ.హెచ్.ఫరూఖీ, 53వ వార్డు కార్పొరేటర్ భర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

119 వాహనాలపై కేసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు విశాఖలో పలు చోట్ల బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గాజువాక, ఎన్ఏడీ, మద్దిలపాలెం, బీచ్ రోడ్డు, బోయపాలెం ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి 119 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.1.36 లక్షలు జరిమానా విధించినట్టు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. రెండు వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు ప్రవీణ్ కుమార్, బుచ్చిరాజు, మనక మోహన్, గణేష్ రెడ్డి, సుధీర్, సత్యం నాయుడు, కె శ్రీనివాస్, రోఖిమున్నీషా, మాధవి, ఏఎంవీఐలు శ్రీనివాస యాదవ్, సుమన్ కుమార్, సృజన, శిరీష, లలిత, ఎంఎస్‌వి ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డులో నమోదుకండి

సీతంపేట: వైఎస్సార్ బీమా పథకంలో నమోదు చేసుకున్న భవన నిర్మాణ, ఇతర రంగాల కార్మికులు కార్మిక సంక్షేమ బోర్డులో కూడా నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ బీమా పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 1.21 కోట్ల మంది కార్మికులు లబ్ధిదారులుగా నమోదు చేసుకున్నారని చెప్పారు. ఇందులో 24 లక్షల మంది కార్మికులు భవన నిర్మాణ రంగం వృత్తిలో ఉన్నట్లు తెలిపారు. జిల్లా గణాంకాల ప్రకారం 1,82,064 మంది కార్మికులు వైఎస్సార్ బీమా పథకంలో నమోదు చేసుకున్నారని.. కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు కాలేదన్నారు. వారంతా సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయంలో కార్మికులుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు అందించే పథకాలు, పీఎంఎస్‌వైఎం, ఎన్‌పీఎస్ ట్రేడర్స్ తదితర పథకాలు పొందేందుకు తప్పనిసరిగా ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు నిరంకారి సద్గురు మాతా సుదీక్షా రాక

దాబాగార్డెన్స్: నిరంకారి సద్గురు మాతా సుదీక్షా గురువారం విశాఖ రానున్నారు. నగరంలో పలు ఆధ్యాత్మిక కేంద్రాలు సందర్శించనున్నారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో సత్సంగం(విశాల పంత్ సమాగం) నిర్వహించనున్నారు.

బీచ్‌లో మాజీ ఉప రాష్ట్రపతి మార్నింగ్ వాక్



వాకర్స్‌తో ముచ్చటిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బీచ్‌రోడ్డు: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు బుధవారం ఉదయం ఆర్కే బీచ్‌లో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా తోటి వాకర్స్‌తో ముచ్చటించారు. ఆయన నగరానికి వచ్చిన ప్రతీ సారి సాగరతీరంలో మార్నింగ్ వాక్ చేస్తుంటారు.

పర్యావరణ సమతుల్యతతోనే స్వచ్ఛ విశాఖ

దాబాగార్డెన్స్: పర్యావరణ సమతుల్యతతోనే స్వచ్ఛ విశాఖ నిర్మాణం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ మహమ్మారి మానవాళితో పాటు జల, చర జీవ రాశులకు ఎంతో హాని కల్గిస్తుందని, అందుకు ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమి వేయాలన్నారు. నగరంలో ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించామని, అందుకు విరుద్ధంగా ప్లాస్టిక్ తయారీ, నిల్వ, సరఫరా, రవాణా, విక్రయం వాడకం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ గుడ్డ, నార, చెక్క వంటి వస్తువులను ఉపయోగించాలని, ప్రజలకు అవగాహన కోసం గతంలో బీచ్‌రోడ్డులో ఎకోబజార్ ఏర్పాటు చేశామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు, విద్యా, వ్యాపార సంస్థలు, నగర ప్రజలు స్వచ్ఛందంగా కృషి చేస్తున్నప్పటికీ.. ఇంకా కొంత మంది వ్యాపారస్తులు అక్కడక్కడ నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. మార్చి నెలలో రెండు అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్న దృష్ట్యా నగర సుందరీకరణకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

15న మహాబడ్జెట్



దాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వ సభ్య(ప్రత్యేక) బడ్జెట్ సమావేశం ఈ నెల 15న జరగనుంది. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరగనున్న సమావేశంలో 2023–24 ఏడాదికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాలు కౌన్సిల్ సభ్యుల ముందుకు రానున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను గతేడాది నవంబర్ 29, 39 తేదీల్లో స్థాయీ సంఘం ఆమోదించిన సంగతి తెలిసిందే..

- 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్‌లో సచివాలయ భవనాలు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.3 కోట్ల నుంచి రూ.10కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- ఫ్లై ఓవర్ కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.30 కోట్ల నుంచి రూ.60 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నూతన నీటి సరఫరా లైన్ల కోసం 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లకు సవరించాలని ఆమోదించారు.
- జీవీఎస్‌సీసీఎల్ సహకారం(స్మార్ట్ సిటీ) కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.200 కోట్ల నుంచి రూ.60కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.250కోట్ల నుంచి రూ.100 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- సోలార్ లైటింగ్ కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్లకు సవరించాలని, విరాళాలతో చేపట్టే పనుల కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.4కోట్లకు, 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.7.50 కోట్ల నుంచి రూ.19.50 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నది, నీటి ట్యాంకుల పరిరక్షణకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.0.50 కోట్ల నుంచి రూ.2 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు సవరించాలని, సీఎండీఎఫ్ కింద ముడసర్లోవ పార్క్ అభివృద్ధి భూమి రక్షణకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.13 కోట్ల నుంచి రూ.55 కోట్లకు, 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.10 కోట్ల నుంచి రూ.80కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.

2023–24 అంచనాల బడ్జెట్ ఇలా..

ప్రారంభపు నిల్వ: రూ.48058.32 లక్షలు

అన్ని పద్దుల కింద జమలు: రూ.382262.50లక్షలు

ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు: రూ.430320.82 లక్షలు

అన్ని పద్దుల కింద ఖర్చులు: రూ.406349 లక్షలు

ముగింపు నిల్వ: రూ.23971.82 లక్షలు

	జమ (రూ.లక్షలో)	ఖర్చు (రూ.లక్షలో)
సాధారణ పద్దు	91458	17515
ఇంజనీరింగ్	38466	93761
లైటింగ్	---	15195
ప్రాజెక్టులు	19350	39970
ప్లానింగ్	31540	5242
యూసీడీ	52000	53735
విద్య	15	1907
పార్కులు, లీజర్స్	2000	11436
ప్రజారోగ్యం	11811.50	42588
మంచినీటి సరఫరా	43160	25985
జేఎన్ఎన్‌యూఆర్ఎం	105575	
రాజీవ్ ఆవాస్ యోజన	---	500
అమృత్	15000	16400
ఇతర నిధులతో ప్రాజెక్టులు	19120	19120
ఆర్థిక సంఘం నిధులు	27600	28150
డిపాజిట్ల అడ్వాన్స్‌లు	30732	29270

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే మన లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, పార్టీ నేతలు

- ప్రతీ వార్డులో సమావేశాలు నిర్వహించండి
- పార్టీ ఏదైనా.. ప్రతీ పట్టభద్రుడిని ఓటు అడగండి
- కార్పొరేటర్లకు వైవీ సుబ్బారెడ్డి దిశానిర్దేశం



హాజరైన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరం సమష్టిగా పనిచేద్దామని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్పొరేటర్ల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి.. విశాఖ నుంచి పరిపాలన సాగించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న మనకే పట్టభద్రులను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే తమ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తల్లిదండ్రులు ఆలోచన చేస్తున్నారన్నారు. పెట్టుబడులు పెరగడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని యువత నమ్ముతున్నారన్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2.83 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని.. వీరిలో నగరానికి చెందిన 1.40 లక్షల మంది ఉన్నాయన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖ నగరం చాలా కీలకమన్నారు. ప్రతీ కార్పొరేటర్ వార్డుల్లో సమావేశాలు నిర్వహించి.. ప్రతీ ఓటు వైఎస్సార్ సీపీకి పడేలా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని సూచించారు. పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచి సుధాకర్.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి అడుగులు వేశారని, అతనికి వేసే ప్రతీ ఓటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేసినట్లేనని అన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ అభ్యర్థి మార్పు

టీడీపీ హయాంలో ప్రజలకు ఏనాడైనా చంద్రబాబు మేలు చేశారా? నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారా? ఏమి చేశారని ఇప్పుడు ఓట్లు అడుగుతారని సుబ్బారెడ్డి ప్రశ్నించారు. టీడీపీ బలహీనపడిందని.. ఆ పార్టీని ప్రజలు ఎప్పుడో మరిచిపోయారన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ అభ్యర్థిని మార్పు చేశారని, ఎవరెంతమందిని మార్చుకున్నా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అత్యధిక మెజారిటీలో గెలుస్తారని సుబ్బారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమే తనను గెలిపిస్తుందని తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులందరితో కలిసి పట్టభద్రుల వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకట్రామయ్య, ఎస్‌ఏ రెహ్మాన్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, కోలా గురువులు, పల్లా చినతల్లి, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాస్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

13 నుంచి టెక్నోప్రెన్యూర్‌షిప్‌పై శిక్షణ



కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజ్(ఎన్ఐ–ఎంఎస్ఎంఈ) సంయుక్తంగా ఈ నెల 13 నుంచి ఆరు రోజుల పాటు అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. సస్టెనబుల్ డెవలప్‌మెంట్‌పై టెక్నోప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డిగ్రీ విద్యార్హత కలిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్‌లు ఈ శిక్షణ తరగతులకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా 95992 29217 నంబర్‌లో సంప్రదించవచ్చు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, డాక్టర్ అనింద్య రాయ్ చౌదరి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

● ఒంపు సొంపులు



బీచ్ నుంచి ఒంపు సొంపులతో వయ్యారంగా కనిపిస్తున్న ఈ పైపులు డ్రెడ్జింగ్ కోసం ఏర్పాటు చేశారు. ఏటా తీరంలో పేరుకుపోయిన ఇసుకను డ్రెడ్జింగ్ చేస్తుంటారు. ఈ ఏడాది కూడా అందుకు సన్నద్ధమవుతున్నారు పోర్ట్ అధికారులు. ఇందుకోసం ముందుగా సముద్రంలోకి పైపులైన్ వేశారు. నేడో రేపో ఓడతో డ్రెడ్జింగ్ మొదలు పెడతారు. ఆర్కే బీచ్‌లో సందర్శకులను ఈ పైపులైన్ ఎంతో ఆకర్షిస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

● రాళ్లు తేలాయి



విశాఖ సాగర తీరం నిత్య నూతనం. సముద్రం ముందుకొచ్చిన, వెనక్కి వెళ్లినా వినూత్నంగానే ఉంటుంది. బుధవారం మరోసారి సముద్రం వెనక్కి వెళ్లింది. దీంతో తరచూ అలల అడుగున ఉండే రాకాసి రాళ్లు బయటపడ్డాయి. ఇవి చూపరులకు కనువిందు చేశాయి. ఆ రాళ్లపై నిలుచుని ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని ఎందరో సంబరపడ్డారు. విశాఖ ఆర్కే బీచ్‌లోనిది ఈ దృశ్యం.

● షీ(సీ) పోలీసింగ్



రోడ్ల మీద, పోలీస్ స్టేషన్లలోనే కాదు.. తీర ప్రాంతంలోను సమర్థవంతమైన పోలీసింగ్‌కు నిదర్శనమిది. నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సాగరతీరంలో పర్యాటకుల భద్రత కోసం నగర పోలీసులు చేపడుతున్న 'సీ పోలీసింగ్'సత్ఫలితాలిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సముద్ర ప్రమాదాల్లో చిక్కుకోకుండా తీరంలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. బుధవారం ఆర్‌కే బీచ్‌లో రాళ్ల మధ్య కెరటాల్లో యువత కేరింతలు కొడుతుండగా.. అది ప్రమాదమని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ జాగ్రత్తలు చెప్పి వారిని బయటకు రప్పించారు.

నారా లోకేష్ రాజకీయాల్లో ఒక బచ్చా

- భయం అనే పదం సీఎం జగన్ డిక్షనరీలోనే లేదు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ

మహారాణిపేట(విశాఖ): రాజకీయాల్లో నారా లోకేష్ ఒక బచ్చా.. అతడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని భయపెడతాననడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. బుధవారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యువగళం పేరుతో నారా లోకేష్ చేస్తున్నది పాద యాత్ర కాదని.. అది టీడీపీకి పాడె కట్టే యాత్ర అని ఎద్దేవా చేశారు. పాదయాత్రలో నారా లోకేష్ చౌకబారు విమర్శలు మానుకోవాలని సూచించారు. సోనియాగాంధీ, తన తండ్రి చంద్రబాబు వల్లే జగన్‌మోహన్‌రెడ్డిని భయపెట్టడం సాధ్యం కాలేదని గుర్తుంచుకోవాలన్నారు. భయం అన్న పదం జగనన్న డిక్షనరీలోనే లేదని, భయం అన్న మాటకు మీనింగ్ తెలియని బ్లడ్ ఆయనదని అన్నారు. జనసేన నాయకులకు చేతనైతే వైఎస్సార్ సీపీ నాయకులపై మాట్లాడండి.. కానీ రాజకీయాలకు ఏ సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భారతమ్మపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పిరికిపందలు చంద్రబాబు, లోకేష్

ఓటుకు నోటు కేసులో అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చిన పిరికి పందలు చంద్రబాబు, లోకేష్‌లు కాదా? అని రాజీవ్ గాంధీ ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రాణభయంతో వీరు హైదరాబాద్‌లోని ఇంట్లో దాక్కున్న విషయం అందరికీ తెలుసన్నారు. వీరు జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితేనే భయంతో గజగజ వణికిపోతారని, పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం చూపిస్తున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ

హరిరామజోగయ్య లేఖల పేరుతో రాజకీయం

హరిరామజోగయ్య లేఖల పేరుతో రాజకీయం చేస్తున్నారు తప్ప ఏనాడూ కాపు జాతి మేలుకోసం పనిచేసింది లేదన్నారు. చంద్రబాబు కాపు జాతి బిడ్డల మీద వందలాది తప్పుడు కేసులు పెట్టినప్పుడు ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సుమారు 160కి పైగా కేసులు ఎత్తి వేస్తే.. ఒక కాపు జాతి నాయకుడిగా కనీసం ధన్యవాదాలు తెలుపుతూ ఎందుకు లేఖ రాయలేదు అని ప్రశ్నించారు. అంటే హరిరామ జోగయ్య కేవలం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అవసరం అయినప్పుడు మాత్రమే లేఖలు రాస్తూ రాజకీయం చేస్తున్నారన్న విషయం అందరికి అర్థమవుతుందన్నారు. కాపు జాతి బిడ్డలకు అత్యధికంగా మేలు జరిగింది జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే అని, కేవలం 2019 - 2022 పూర్తయ్యేసరికి రూ.27 వేల కోట్ల పైన లబ్ధి కాపు జాతి బిడ్డలకు జరిగిందని తెలిపారు. ధైర్యం ఉంటే 2014-2019 మధ్యలో కాపు జాతి బిడ్డలకు చంద్రబాబు, పవన్ ఎంత లబ్ధి చేకుర్చారో చెప్పాలని.. దీని పైన బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు.

పిల్లల్లో భక్తిభావం పెంపొందిస్తాం

- ధార్మిక నర్సరీ ప్రోగ్రాం అమలుకు చర్యలు
- సింహాచలక్షేత్రంలోని శిల్ప సంపద అద్భుతం
- కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

సింహాచలం: దేశంలో ధార్మిక, సంస్కృతి పరమైన కార్యక్రమాలు ఎక్కువగా జరగాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆకాంక్షించారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువు, ఉద్యోగం కోసం యువత విదేశాలకు వెళ్లే అవసరం ఉండకూడదన్నారు. మన దేశంలోనే ఉన్నత విద్యావకాశాలు కల్పించాలన్నారు. మన దేశానికి, మన చరిత్రకు సంబంధించిన తెలుగు సాహిత్యం, చిత్ర లేఖనం, శిల్పకళ, నాదస్వరం, వీణావాద్యం, మృదంగం తదితర కళలను గౌరవించాలన్నారు. రాష్ట్రంలో వేదం, సంస్కృతం, కళలు తెలియజేసేందుకు ధార్మిక నర్సరీ ప్రోగ్రాం అమలు చేస్తామన్నారు. చిన్న వయసులోనే భక్తి, స్తోత్రాలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళ, అష్టావధానాలు నేర్పి భావితరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో గోవులను బాగా సంరక్షిస్తున్నారని తెలిపారు. దేశీయ గోవులను సంరక్షించాలని సూచించారు. మహిళల కోసం గుంటూరులో కంచి కామాక్షి కన్యకా విద్యాలయం, మహిళలకు కుటుంబ వ్యవస్థ గురించి తెలిపేలా కాకినాడలో స్కూలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలో కంచి కామాక్షి కన్యకా విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఎంతో గొప్ప శిల్పకళా వైభవం సింహాచలంలో ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపంలో విద్యార్థులతో నారసింహ కరావళంబం స్తోత్ర పఠనం చేయించారు. అంతకుముందు ఆలయ రాజగోపురం వద్ద ఆయనకు దేవస్థానం వైదికులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని స్పృశించి, బేడా మండంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. వేద స్వస్తిని నిర్వహించారు. స్వామి ప్రసాదం అందజేశారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే విజయేంద్ర సరస్వతి సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల, వేద పాఠశాలను సందర్శించారు.



విజయేంద్ర సరస్వతికి అప్పన్న చిత్రపటం బహూకరిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

గోపాలపట్నం: బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలోని నేతుపూడి మురళీ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వివరాలివీ.. రిటైర్డ్ ప్రైవేట్ ఉద్యోగి మురళీతో పాటు ఆయన భార్య అచ్చియ్యమ్మ, కొడుకు పాండు ఇక్కడ నివాసం ఉంటున్నారు. మురళీ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లగా.. పాండు కూలి పనులకు వెళ్లాడు. అచ్చియ్యమ్మ ఇంటి బయట పరిసరాలు శుభ్రం చేస్తోంది. ఉదయం 9.30 నుంచి 10 గంటల మధ్య పైఅంతస్తులో ఉన్న పడక గది నుంచి దట్టంగా పొగలు రావడం స్థానికులు గుర్తించి అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చారు. వెంటనే మర్రిపాలెం ఫైర్ అధికారుల ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించిందని గుర్తించారు. ఈ ప్రమాదంలో రూ.5 వేల నగదు, విలువైన డాక్యుమెంట్లు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయని బాధితులు తెలిపారు. సుమారు 30 తులాల బంగారం బుగ్గిపాలైందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గోపాలపట్నం పోలీసులు తెలిపారు.



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన వస్తువులు, బీరువా

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

అధికారులకు ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశం

మహారాణిపేట: 'గడప గడపకు మన ప్రభుత్వం'లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అధికారులను ఆదేశించారు. సర్కిల్ కార్యాలయంలోని శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య మీటింగ్ హాలులో బుధవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ పూర్తి చేసిన పనుల పురోగతి నివేదికలను సమర్పించాలన్నారు. జగనన్నకు చెబుదాంలో నమోదైన సమస్యలను 24 గంటల్లోగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో పూర్తయిన గృహాలకు సంబంధించి లబ్ధిదారులకు ఖర్చు లేకుండా తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. వినియోగదారుల ఫిర్యాదులను సకాలంలో స్పందించాలని, సిటిజన్ చార్ట్‌లో కాలపరిమితులు పాటించాలన్నారు. ముందస్తు చర్యలు తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్‌లను అరికట్టాలన్నారు. సకాలంలో రీడింగ్‌లు పూర్తి చేసి వినియోగదారులకు బిల్లులను అందజేయాలని, ఈ ప్రక్రియలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఈ నెల 20లోగా రిలీజ్ చేయాలన్నారు. శతశాతం రెవెన్యూ, మొండి బకాయిలను వసూళ్లు చేయాలని సూచించారు. సర్కిల్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డైరెక్టర్ ప్రాజెక్ట్సు డాక్టర్ ఎ.వి.వి సూర్యప్రతాప్, డైరెక్టర్(ఫైనాన్స్) హెచ్‌ఆర్‌డీ చంద్రం, జనరల్ మేనేజర్ వి.విజయలలిత, సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్, సర్కిల్‌లో ఉన్న వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు, ఇతర అధికారులు

ఫిడే మాస్టర్‌గా సాహితివర్షిణి



విశాఖ స్పోర్ట్స్: చదరంగం ఫిడే మాస్టర్(ఎఫ్ఎం)గా నగర క్రీడాకారిణి ఎం.సాహితివర్షిణి టైటిల్ సాధించింది. 2300 ఫిడే ఎలో రేటింగ్‌తో నార్మ్స్ సాధించిన సాహితిని ఎఫ్ఎంగా ఇటీవల వరల్డ్ చెస్ ఫెడరేషన్ అధికారికంగా ప్రకటించింది. సాహితి వర్షిణికి ఇది చదరంగంలో నాలుగో టైటిల్ కావడం విశేషం. ఇప్పటికే వుమెన్ క్యాండిడెట్ మాస్టర్, వుమెన్ ఫిడే మాస్టర్‌లతో పాటు వుమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్స్‌ను సొంతం చేసుకుంది.

'సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం'

డాబాగార్డెన్స్: ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, కార్మిక సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినప్పటికీ.. పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయడం లేదన్నారు. ఉద్యోగ, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు కమిషనర్ తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగ, కార్మిక అభ్యున్నతికి ఏర్పాటు చేసిన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంఘానికి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అనుబంధం చేశామన్నారు. ఈ మేరకు కమిషనర్‌కు 20 రోజులు ముందుగా సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు.

సీఎం జగన్‌కు రుణ పడి ఉంటాం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

రూ.10లక్షలకు ఎక్స్‌గ్రేషియా పెంచడంపై యాతకులన్నుల సంతోషం

తాటిచెట్లపాలెం: కల్లుగీత వృత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి తామంతా రుణపడి ఉంటామని రాష్ట్ర యాత సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె నివాసం వద్ద బుధవారం ఆమె సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కల్లు సేకరణ సమయంలో ప్రమాదం సంభవించి మరణించినా, లేక శాశ్వత అంగవైకల్యానికి గురైనా వైఎస్సార్ గీత భరోసా కిందట రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం సంతోషమన్నారు. యాతల సంక్షేమం కోరుతూ ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కేవలం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తే.. ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచడం ఆనందదాయకమన్నారు. యాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. ఎన్నో సమస్యలను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామని పిల్లి నూకరాజు తెలిపారు. శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ చైర్‌పర్సన్ కొల్లు సింహాచలం, చోడే సావిత్రి, చుక్క విష్ణువందన, కొలుసు రూపవతి సత్యం, పోలవరపు అప్పారావు, దమ్ము రమణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

- ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈవో ఎల్.చంద్రకళ
- అర్చకునిపాలెం పాఠశాల భవనం పరిశీలన
- ఆసుపత్రిలో విద్యార్థులకు పరామర్శ

పద్మనాభం: అర్చకునిపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రమాదానికి సంబంధించి సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. మంగళవారం పాఠశాల భవనం శ్లాబు సీలింగ్ పెచ్చులూడి ముగ్గురు విద్యార్థులకు గాయాలైన విషయం తెలిసిందే. ఈ భవనాన్ని బుధవారం వీరు సందర్శించి ఘటన జరిగిన తీరు తెన్నులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బాధ్యులపై తక్షణ చర్యలు నిమిత్తం ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరికి స్వల్ప గాయాలవ్వగా తాలాడ వేదశ్రీకి కుట్లు పడ్డాయని వైద్యులు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఈ అంశంపై విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తమతో ఎప్పటికప్పుడు మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సూచనలు చేస్తున్నారని ఆర్జేడీ జ్యోతికుమారి తెలిపారు. వీరి వెంట సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, డీవైఈవో గౌరిశంకర్, డీసీఈబీ బోర్డు కార్యదర్శి కృష్ణ కుమార్ పాల్గొన్నారు. అర్చకునిపాలెం ఉపాధ్యాయులు సిహెచ్.సోములు, శ్రీనివాసరావులకు విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



విజయనగరం మహారాజా ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించి వైద్యులతో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్ర కళ

రాళ్లతో దాడి చేశారని వీఆర్వో ఫిర్యాదు

సబ్బవరం: ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన తమపై అసకపల్లి సర్పంచ్ రాళ్ల దాడి చేయించారని ఓ వీఆర్వో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. అసకపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 16లో ప్రభుత్వ భూమి, సర్వే నంబర్ 26లో చెరువు ఆక్రమణకు గురైందని.. వెంటనే తొలగించాలని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో విజయశ్రీ, రెవెన్యూ సిబ్బంది కలిసి పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లారు. ప్రొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాలు తొలగిస్తుండగా.. సర్పంచ్ కర్రి నరసింగరావు, తన అనుచరుడు పంచదార్ల రాజ్ కుమార్ అడ్డుకున్నారు. తమను దుర్భాషలాడుతూ.. రాళ్ల దాడి చేశారని వీఆర్వో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నీవు ఉద్యోగం ఎలా చేస్తావని తీవ్ర పదజాలంతో హెచ్చరించారన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు రాళ్లతో దాడులకు పాల్పడిన సర్పంచ్, రాజ్ కుమార్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.



వీఆర్వోతో వాగ్వాదానికి దిగిన సర్పంచ్ కర్రి నరసింగరావు తదితరులు